# నా బతుకు నాది కాదు

రత్నాకర్‌కు రవ్వంత మగతగా ఉంది.

ఈ మగత మాంఛి నిద్రగా మారితే ఎంత బాగుండు! గ్రైండర్లో రుబ్బురోలులా రాత్రంతా మంచమ్మీద అటూ ఇటూ ఎన్ని సార్లు దొర్లినా నిద్రాదేవి కరుణించలేదు. కొద్ది రోజుల నుండి అది మామూలైపోయింది. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో అన్ని రోజులున్నా వేయిరూపాయల కట్టలకు రెక్కలొచ్చి ఎగిరిపోయినా తన పరిస్థితి రానురాను రాజు గుర్రం గాడిదైనట్లుగానే ఉంది. నరాలు బిగపట్టి దవడ కండరాల్లోకి ఏకీకృతం చేసి ప్రయత్నించినా నోటిమాట రావటం లేదు. గొంతు సమ్మె చేస్తుంటే ఒళ్లంతా కుదేసినట్టుంది.

అధునాతన హంగులు సంతరించుకున్న మూడంతస్తుల బంగళా, ఏసి గదిలో ఖరీదైన ఫోంబెడ్ మీదున్న తనకేంతక్కువనీ! పతియే ప్రత్యక్ష దైవంగా భావించి సేవలందించే భార్య, కనుసన్నల్లో మెదిలే ఇద్దరు కొడుకులూ–కోడళ్లు... గడప లోపలున్న హాయి కైలాసములో గూడా ఉండదంటారు. అందుకే హాస్పిటల్ నుండి ఇంటికి తీసుకొచ్చారు. రోజూ డాక్టరింటికొచ్చి చూస్తున్నాడు. అడిగిన మరుక్షణంలో అన్నీ సమకూరుతున్నాయి.

దైవదత్తమైన ఉపన్యాసకళ బతుకుబాటలో బంగారం పండించింది. తన ఉపన్యాసం వినేందుకు జనాలు పడిఛస్తారు. సభల్లో వ్యాఖ్యానం చేస్తుంటే కలగలిపిన ఉపన్యాసం సామాన్యులను సైతం ఉ ద్రూతలూగిస్తుంది. ఆ సభ జనమనోరంజకమైపోతుంది. సత్సంగమైనా తనను సగౌరవంగా తీసుకెల్తారు. చేతినిండా పారితోషికం, చెవులనిండా ప్రశంసలు.

"రత్నాకర్ మాటలు, రతనాల మూటలు"

"ఉర్రూతలూగించే ఉపన్యాసం చేస్తున్నా, జనాల కరతాళధ్వనులు మార్మోగుతున్నా మనిషి మాత్రం నిబ్బరంగా చలాకీగా ఉంటాడు. తాను నవ్వకుండా సభను నవ్విస్తాడు."

"వాఖ్యానమో గంగార్ఝురి. పురాణగాథలు, సంస్కృత శ్లోకాలు కొట్టినపిండి. పిట్టకథల్లోని హాస్య వ్యంగ్య బాణాలు అందరినీ ఆదనందడోలిక లూగిస్తాయి."

"పురాణేతిహాసాల అంశాలు వివరిస్తూంటే వింటున్న వారు మంత్రముగ్దులైపోయారు."

సాధారణ జనాభిప్రాయం అసాధారణుల నోటిగుండా వింటూంటే పంచభక్ష్యపరమాన్నాలతో భోంచేస్తున్నట్టుగా ఉంటుంది. ఆ తృప్తి... మాటల కందనిది.

ఎవరన్నా... ఎప్పుడన్నా.. ముసిముసి నవ్వులతో... "మాయల ఫకీరు ప్రాణము చిలకలోనే ఉందన్నట్లుగా రత్నాకర్ విజయ రహస్యమంతా ఆ పొట్లంలో ఉంది." అంటే ... తమాషాగా నవ్వి ఊరుకోవడం అలవాటైంది.

దాని మజా వాళ్లకేం తెల్సు! క్రీంకలర్ పొట్లంమ్మీద బంగారు రంగుగీతలు... అదెప్పుడూ వెంట ఉండాల్సిందే! పొట్లం విప్పుకుని నోట్లో జార విడుచుకుంటే... మబ్బుల ఆకాశాన్ని చూసి పురివిప్పిన నెమలి పింఛములా, మెదడుపొరల్లో జీవం పోసుకున్న భావలహరులు ఉపన్యాసంగానో, వ్యాఖానంగానో బయటికొచ్చి జనమానస సరోవరములో రాజహంసల్లా ఈదులాడ్తాయి. తనపై ప్రశంసల జల్లు కురుస్తుంది.

మంత్రుల, ఉన్నతాధికారులు కూడా మంత్రముగ్ధులై పొగడ్తల్లో ముంచెత్తి సన్మానించిన సందర్భాలెన్నో ఉన్నాయి. సాహితీ సాంస్కృతిక సంస్థలు ఉపన్యాసకేసరి, వ్యాఖ్యానధురీణ.... బిరుదులిచ్చి సత్కరించాయి. అందుకే కళామతల్లి తన మనోమందిరంలో కొలువుదీరి కోటేశ్వరునిగా మార్చేసింది. సుఖసంతోషాలను సొంతం చేసింది.

మనిషి ఎంత ఎత్తుకెదిగినా కోరుకునేది సుఖము, గౌరవమే గదా! షడ్రుచుల భోజన మారగిస్తుంటే గాఢ నిద్రలోకి జారుకుంటూ సుఖానికి భాష్యం గోచరిస్తుంది. సాంసారిక సుఖం సరేసరి. నలుగురి ప్రశంసలు పెద్దల అభినందనలు, సన్మానాలు.... అవేగదా గౌరవమంటే! సుఖ, గౌరవాలు నలుగురితో తిరుగుతున్నప్పుడే గదా సొంతమయేది. అప్పుడవన్నీ అందివచ్చిన మాట వాస్తవమే! సుఖ సాగరములో ఈదులాడుతూంటే లోకము సుందరోద్యానవనములా కనబడింది.

ప్రస్తుతం... ఏమాత్రం సమయం దొరికినా గతం స్వగతమైపోతుంది. అన్నట్టూ... ఇప్పుడు వేడి టీ చప్పరిస్తే ప్రాణానికి హుషారుగా ఉండేది. నరాలు నూతన స్వరాలు పలికేవి.

గుమ్మంవద్ద పదమంజీరాల ఘలంఘలలు

"ఏమండీ! టీ పోసెయ్యనా?" అర్ధాంగి ఇందుమతి ఫ్లాస్కుతో వస్తోంది.

నిజమే! తనకిప్పుడు చాయచప్పరించే అవకాశంలేదు గదా! నోరు తెరుచుకోదాయే. కడుపు పక్కన అమర్చిన గొట్టంద్వారా లోపలికి జారవిడవాలాయే! ఆకలి తీర్చేందుకు ద్రవపదార్థాలు మాత్రమే ఆహారమాయె! ఏవిటో... నోటి రుచుల్ని గుర్తుచేస్తూ నొసలు వెక్కిరించింది. శాస్త్రవిజ్ఞానమెంత అభివృద్ధి చెందినా మనుషుల బుర్రలకు పట్టుకున్న బూజు దులిపే సాధనాలు రాలేదు.

ఆశాదీపాలైన కళ్లు... భార్య నాపాదమస్తకం తడిమాయి. ఎంతలో ఎంతమార్పు! ఏడువారాల నగలతో ఇంద్రాణిలా కనిపించే ఇందుమతి శిశిర ఋతువులో మోడుబారిన చెట్టులాగైంది. నా కుటుంబవనములో మళ్లీ వసంతమెప్పుడు వస్తుందో!"

"సరే పోసెయ్" మన్నట్టుగా తలూపాడు.

పొద్దున్నే పెద్దకొడుకొచ్చి స్నానం చేయించి వెళ్లాడు. ఇప్పుడీమె పక్కన కూచుని ఓపిగ్గా, నేర్పుగా గొట్టంలోంచి టీ జారవిడిచింది. చప్పరించే ఆనందం కరువైనా నరాల్లో కదలిక వచ్చేసింది.

"చిన్నోడు అమెరికా నుండి ఫోన్ చేసిండు." నేలను చూస్తోంది ఇందుమతి. "మీ ఆరోగ్యం గురించి అడిగిండు. అమెరికాలోని తెలుగు సంఘాలు సంయుక్తంగా మీ ఉపన్యాస కార్యక్రమమేర్పాటు చేస్తున్నారంటా. చిన్నకోడలు, కొడుకు, పిల్లలూ అంతా బాగున్నారటా. వానికి సెలవు దొరికే అవకాశముందటా. వారం రోజుల్లో వస్తానన్నాడు." పాఠం చదివినట్టు చెప్పేసింది. గుండె పొంగి గొంతు కద్దుపడింది.

గదవబట్టి తలపైకిలేపాడు. రెండు కన్నీటి చుక్కలు చేతిమీద వాలాయి. సరసోపన్యాసం చేస్తుంటే చేతిలో ఉన్న మౌతుపీసులోకి కరెంటు పాసై షాక్ కొట్టినట్టైంది.

"అవి ఇటివ్వు" మన్నట్టుగా టీ పాయ్‌మీదున్న కాయితం, కలాన్ని కళ్లతో చూపించాడు. అందించింది. మాటలు కలంద్వారా కాయితంపైకొస్తున్నాయి.

"బాధపడకు ఇందూ."

అది చదివి కొంగుతో కళ్లద్దుకుంది. "మహా రాజులాగున్నమీరు మంచానికి పరిమితమై పోయారు. తలుచుకుంటే గుండె తరుక్కుపోతుందండీ!" అంది బేలగా.

నవవసంతములో విరబూసిన పూవులా గుండే మొహం మండుటెండలో మాడిపోతున్న కలువభామలా ముడుచుకుపోయింది.

"అయితే ఏం?" మళ్లీ కలం కదిలింది. "అన్ని రోజులు ఆస్పత్రిలో, ఆ తర్వాత ఇంట్లో వాడిన మందుల ప్రభావం ఊరికే పోతుందా! కొద్ది రోజుల్లో నా సమస్య పరిష్కారమైపోతుంది. అప్పుడు చిన్నోడితో హాయిగా అమెరికా వెళ్లిపోవచ్చు" రాసి చూపించాడు.

పొత్తికడుపులోని పేగుల్ని పరపరా కోసినట్టనిపించింది ఇందుమతికి. ఎగదన్నుకొస్తున్న ఎసరును పక్కకుతిరిగి నియంత్రించుకుంది. సంవత్సరం క్రితం సంఘటన మనోయవనిక మీద రంగుల చిత్రంలా కదలాడ్తోంది.

xxxx

"అక్కా... అక్కా" నాగేశ్వర్ నవ్వుతూ ఇంట్లో కొస్తున్నాడు. తమ్ముని పిలుపుతో మనసు చెంగలించింది. తనలో ఉత్సాహం...

"ఒరేయ్ ... నాగూ!॥ హుషారుగా ఎదురెళ్ళి తీసుకొచ్చి సోఫాలో కూచోబెట్టింది. అదే పట్టణంలో జరగబోయే ఏదో కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వెళ్లేందుకు తయారైన రత్నాకర్ గదిలోంచి ఠీవిగా బయట కొచ్చాడు.

"బాగున్నావా నాగేశ్వర్!" పలుకరిస్తూ ఆరేళ్ల నుంచి అలవాటైన పొట్లాన్ని విప్పి నోట్లోజారవిడుచుకున్నాడు.

"బాగున్నాను బావా!" నాగేశ్వర్ చూపులతణ్ని కిందినుంచి మీద్దాక తడుముతున్నాయి... "ఆహా! కంచిపట్టు, జరీ అంచుధోవతి, బెనారస్ సిల్క్ లాల్చీ, నుదుట విభూతి రేఖలు... కైలాసం నుండి దిగివచ్చిన పరమేశ్వరుడి లాగున్నావు. బావా! ఏదన్నా ప్రోగ్రాం కెల్తున్నారా!"

"అవునోయ్! ఇందులో సినిమాతారలు, సాస్కృతిక శాఖామాత్యులు పాల్గొంటున్నారు. అందులో నాపాత్ర..."

"శ్రోతలనుర్రూతలూగించే వ్యాఖ్యానం చెయ్యడం గదా!"

"అవునవును. నిన్నుచూసి చాలాకాలమైంది. బ్యాంకాఫీసర్‌వి గదా! లోకల్ బ్యాంక్ ఇన్స్‌పెక్షనా!" తియ్యని మాటల్లో కమ్మని దెప్పిపొడుపుంది.

"అక్కా! ఆవులిస్తే పేగులు లెక్కబెట్టడం బావ కలవాటే గదా! నేనొచ్చింది అందుకే బావా!"

"అద్సరే!" తాను కల్పించుకుంది" ముందు నువ్వు స్నానమదీకానివ్వరా. బావగారితో సాయంత్రం సావకాశంగా మాట్టాడుకోవచ్చు..."

"అబ్బే! నేను సాయంత్రం అట్నుంచటే అర్జంట్‌గా వెళ్ళాలి. బావగారి గురించి బాగా వింటున్నాను.

పత్రికల్లో చదువుతున్నాను. బావ కంచుకంఠం ఖంగుమంటూ వ్యాఖ్యానం ప్రారంభిస్తే సభాస్థలి కరతాళ ధ్వనులతో దద్దరిల్లి పోతుంది. ఆయన మా బావేనని నలుగురితో చెప్పుకుంటూంటే గర్వంగా ఫీలవుతున్నా నక్కా!"

తనమనసులో మలయమారుతం వీచింది.

"అక్కాతమ్ముడు కలిసి నన్ను మునగచెట్టెక్కిస్తున్నారు" సోఫా వెనక్కొరుగుతూ హుందాగా నవ్వేశాడు రత్నాకర్.

"కాదు... ఉన్నమాటన్నానుగానీ... నాకో అనుమానం బావా!" నాగేశ్వర్ వాలకం గంభీరమైంది.

"అనుమానం పాతరోగమన్నారోయ్!" కాలుమీద కాలేసుకున్నాడు రత్నాకర్. "అడిగెయ్??"

"ఏంలేదు బావా! ఆ పొట్లం వాడకం తమరికి హాబీయా లేక హాబిటా? అలవాటైతే..."

"అం... ఏదో అయిందిలేవోయ్!" పసలేని కేసును నిర్దాక్షిణ్యంగా కొట్టేసిన జడ్జీలాగైపోయాడు.

"అదికాదు బావా! అది ఒంటికి మంచిదికాదంటారు డాక్టర్లు. అందులో కలిసిన పదార్థాలతో ఒళ్లు గుల్లైపోతుందటా."

"పిచ్చి నాయనా! ఇదో రకమైన తాంబూలం లాంటిది. మెనకటి మహారాజులు, చక్రవర్తులు తాంబూలం సేవిచండం, దాన్నో హెూదాగా భావించారు గదా! ఇదో దర్జా బాబూ! ఈ రోజుల్లో చాలా మంది దీన్ని ఎంజాయ్ చేస్తున్నారు."

"అదికాదు బావా! వీటిని థాయ్‌లాండ్ లాంటి దేశాల్లో, మనదేశంలో గూడా నిషేధించారు."

"అదంతా ఓ జిమ్మిక్కు లేదోయ్! ఆదునిక యుగంలో అవన్నీ మామూలే. అయినా దీని మజా నీకేం దెల్సులే..." అంటూ గబగబా వెళ్లి కారులో కూచున్నాడు.

రాక రాక వచ్చిన తమ్ముని కిష్టమైన వంటకాలు చేసి పెట్లాలి. వాడు సాయంత్రం రానంటున్నాడు. తనలోని ఆరాటం పోరాటానికి దిగింది. "అబ్బా! ఆయన సంగతిప్పుడెందుకుగ్గానీ ముందు నువు లేచి స్నానమదీ కానివ్వురా! ఈలోగా నీకిష్టమైన చక్కెరపొంగలి చేస్తా. కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ భోంచేద్దాంరా!" పురమాయించింది.

xxxxx

భార్యమొహాన్ని కొత్తగా చూస్తున్నట్టు విస్తుబోయాడు రత్నాకర్ "ఏయ్ ఇందూ! అలా శూన్యంలోకి చూస్తున్నావేందీ? అమెరికా ప్రయాణం గురించి ఆలోచిస్తున్నావా?" భుజమ్మీద చెయ్యేశాడు. అది పాముపడగలాగన్పించింది. ఉలిక్కిపడబోయి భర్తవైపు చూసి సర్దుకుంది. అప్పుడే ఆపద్బాంధవుడిలా వచ్చాడు డాక్టర్, కొడుకు వెంట ఉన్నాడు... బ్యాగుతో

"రాత్రి నిద్రబట్టిందా?" చిరునవ్వుతో అడిగాడు డాక్టర్.

రత్నాకర్ ఎదపొదలోంచి వెలువడిన నిట్టూర్పుతో అంతా అర్థమైంది డాక్టర్‌కు.

"ప్చ్..... డాక్టర్! ఇప్పుడు నాదేదీ నాక్కాకుండా పోయింది. నోటి నుండి తినలేను, రుచి తెలియదు. అది మూతపడింతర్వాత మళ్లీతెరుచుకోలేదు. మగత తప్ప నిద్రలేదు. బయటి కెళ్లలేను కాబట్టి

గౌరవము జాడలేదు. గొంతు నొప్పి సరేసరి. మనిషాక్కావల్సిందేదీ నా కిప్పుడు లభించడము లేదు. ఇంతకూ ఈ రోగం కుదిరేనా?" మొహంలో రంగులు మారుతుంటూ రాసి చూపించాడు.

"మీరు పేరున్న కళాకారులండీ!" బీ.పి. చెక్ చేసి మందుల కిట్టు తెరిచాడు డాక్టర్. ఇంజక్షన్ లోడ్ చేశాడు. "ప్రస్తుతం మీరు ప్రశాంతంగా ఉండాలి. సకలరోగాలకు సరియైన మందు మనశ్శాంతి. ఏవేవో ఊహించుకుంటూ ఏదోలా ఐపోకండి." ఇంజెక్షన్ చేశాడు. "ఇహ హాయిగా నిద్రపోండి. అన్ని సర్దుకుంటాయి."

డాక్టర్ కిట్టు సర్దుకుంటూంటే రెండు నిమిషాలు మౌనముద్రదాల్చాయి. తల్లీ కొడుకులను తేరిపారి చూస్తూ "ఇప్పుడు నిద్ర పడుతుంది. నొప్పులేవీ తెలీవు. జాగ్రత్తగా కనిపెట్టుకోండి." సలహా యిచ్చాడు. రత్నాకర్ వెల్లకిలా పడుకున్నాడు.

కొడుకేదో గుర్తుకొచ్చినట్టుంది. అమ్మా! డాక్టర్ గారి నేదో అడగాలను కున్నావు గదా! నాన్న నిద్రలోకి జారుకున్నట్టుంది ఇప్పుడడుగు." అంటూ డాక్టర్‌కు సోఫా చూపించాడు.

"అడగండీ!" నిదానంగా కూచున్నాడు డాక్టర్. తల్లీకొడుకులు ఆయన కెదురుగా కూచున్నారు.

"ఇదేదో తగని రోగమొచ్చింది. మాకు ఆందోళనగా ఉంది డాక్టర్!" ఇందుమతి గొంతులో వణుకు, కడుపులోని ఆవేదన కళ్లల్లో మంచుతెరలై కపబడింది. కాదుకు తల్లివైపు చూస్తూ "ఈరోగం పేరు ఓరల్ సబ్ మ్యూకస్ ఫైబసిస్, అంటారన్నారు డాక్టర్లు! అదంటే ఏమిటో మా అమ్మకు చెప్పండి డాక్టర్!" నిర్జీవంగా సోఫాకొరిగాడు.

డాక్టర్ నుండో వేడి నిట్టూర్పు వెలువడింది. ఇక చెప్పక తప్పదనుకున్నాడు.

"ఇవన్నీ కాన్సర్ లక్షణాలమ్మా! రత్నాకర్ గార్కి పొట్లం అంటే గుట్కా తినే అలవాటుంది గదా! వక్కపొడి, జర్దా, కాచుల్లో హానికరమైన మెగ్నీషియా కోమవే, కాటారియాహైడ్రాక్సైడ్ లాంటి పదార్థాలుంటాయి. తినేప్పుడు మజాగా ఉంటుంది. ఆ తర్వాత సజా విధిస్తుంది. అవి గొంతు, నోరును పూర్తిగా ఆక్రమించి ఆ తార్వాత చాపకింది నీరులా శరీరన్నంతా ఆక్రమిస్తాయి. కాన్సర్ ముదిరితే ప్రాణం క్యాన్సిలేనన్నది వాస్తవం. ప్రస్తుతం.. రత్నాకర్‌గారు బతికున్నన్ని రోజులు ప్రశాంతంగా ఉండాలి. కాబట్టి ఇది ఫలానా రోగమని వారికి తెలీయకుండా జాగ్రత్తపడాలి."

నడినెత్తి మీద అణుబాంబు పేలినట్టైంది ఇందుమతికి. మనో సంద్రములోంచి పొంగుకొచ్చిన బడబానలం లాంటి దుఃఖాన్ని గొంతులో అదిమిపెట్టాలని ఎంత ప్రయత్నించినా కుదరలేదు. గొల్లుమంది. కొనకొంగు నోటికడ్డంగా పెట్టుకుని కుమిలిపోయింది. ఆ తర్వాత సర్దుకుంది.

"మా తమ్ముడోసారి హెచ్చరించినా ఈయన దాన్నోజోక్‌గా తీసుకున్నారు డాక్టర్!" నెత్తికొట్టుకుంది.

"ఉష్! నాన్నకు నిద్రాభంగమవుతుందమ్మా, నాన్నకు తన రోగం గురించి తెలిస్తే ముప్పైరోజులు బతికేవాడు మూడు రోజుల్లో తనువు చాలిస్తాడు. మనిషి బతుకునెప్పుడూ నీడలా వెంటాడి వేటాడేది చావేగదా" అంతర్మథనాన్ని బయటపెట్టాడు.

"ఆమాట అక్షరాల నిజం" డాక్టరందుకున్నాడు. పేషంటుకిప్పుడు మనశ్శాంతి కావాలి. ఆ వాతావరణం మీరు కల్పించాలి." హెచ్చరించి వెళ్లిపోయాడు. ఒకరినొకరు ఓదార్చుకుంటూ తల్లీ కొడుకులు బయటకు నడిచారు.

మనసుల్లో చెలరేగిన దుమారం రెండు గంటల్లో సర్దుకుంది. పోస్ట్‌లో వచ్చిన కవరుతో రత్నాకర్ గదిలో కొచ్చింది ఇందుమతి. మంచం దగ్గరికొచ్చి "ఏమండీ!" మెల్లగా పిలిచింది.

'అం... ఏంసంగతీ?" సునామి తర్వాత శాంతించిన సముద్రములాగుంది రత్నాకర్ వాలకం. కూచునేందుకు సాయం చెయ్‌మన్నట్టుగా చేతులు చాచాడు.

"నిద్రబాగా పట్టిందా?" ఆమె గొంతు వణికింది. అతని పెదాల మీద నిర్వేదమైన చిరునవ్వు ఇలా మెరిసి అలా మాయమైంది. ఒడుపుగా భుజాలుపట్టి కూచోబెట్టి దిండుకు ఒరిగించింది.

"ఇదేదో కవరు వచ్చిందండీ పోస్టులో" అంటూ కవరులోంచి ఉత్తరం తీసి అందించింది.

ఉత్తరం చదివి పెదవి విరుస్తూ తిరిగి చేతికిచ్చాడు. చదువుమని సైగ చేశాడు. చూపులు అక్షరాల ననుసరిస్తున్నాయి.

ప్రభుత్వం-సాంస్కృతిక శాఖ నుంచి వచ్చింది.

"... మీ ఉపన్యాసకళను, వ్యాఖ్యాన కౌశలాన్ని ప్రభుత్వం అభినందిస్తుంది. ఈ రంగములో మీ కృసికి గుర్తింపుగా రాబోవు ఉగాదినాడు మిమ్మల్ని ప్రత్యేక పురస్కారముతో సత్కరించాలని నిర్ణయించింది.

ఉగాదినాడు రవీంద్ర భారతిలో సత్కారసభ జరుగుతుంది. ఆ కార్యక్రమములో మీ అనుభాలను, అనుభూతుల్ని ఉటంకిస్తూ అరగంట సేపు ఉపన్యసిస్తూ శ్రోతల నపుర్రూతలూగిస్తారని ఆశించనైనది. మీ సమ్మతిని వెంటనే తెలియజేయండి....

ఉత్తరం ఆసాంతం చదివి జవాబు రాసేందుకు లెటర్‌ప్యాడ్, కలం అందిస్తూంటే చేతులు వణికాయి. రత్నాకర్ చేతికలం లెటర్‌ప్యాడ్‌మీద కదిలింది.

".... ఇప్పుడు నాబతుకు నాదికాదు. ప్రభుత్వం నాకృషిని గుర్తించినందుకు దన్యవాదాలు. నా అసమ్మతిని తెలియజేస్తున్నాను. అందుకు విచారిస్తున్నాను...." రాయడం పూర్తిచేసి పోస్ట్‌చెయ్ మని సైగ చేశాడు.


అది చదవగానే కాలుజారి బోడబావిలో పడ్డట్టైంది.

"అదేమిటండీ?" బుగ్గమీద వేలేసుకుంది.

మళ్లీ కాయితమ్మీద కలం కదిలింది.

"నేను నిద్రబోయాననుకున్నారు గదూ! నిద్ర నా దరికి రాలేదు. డాక్టర్‌గారితో మీరు మాట్లాడిందంతా విన్నాను. నా ఆయుష్షు పొడిగించాలని నావాళ్లు పడుతున్న ఆరాటం అర్థమైంది. నాకు తెలియరాదనుకున్న నిజం తెలిసిపోయింది."

"దర్జాగా గుట్కా చప్పరిస్తూంటే జీవనయానం తార్రోడుమీది జట్కాప్రయాణంలా సాఫీగా సాగి పోతుందనుకున్నాను. ఆ తాత్కాలిక సుఖం వెనుక ఇంత విషాదం దాగుందని అర్థం చేసుకోలేని నాకీ శాస్తి జరగాల్సిందే



కథా నిలయం
శ్రీకాకుళం

(జాగృతి, 13-7-2009)